సాక్షి అనంతపురం

మంగళవారం। 19। డిసెంబర్। 2023



టన్ను చీనీ రూ.26 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26 వేలు పలికాయి.



కిలో టమాట రూ.16
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6 , సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికాయి.


గరిష్టం/కనిష్టం 32.4°/ 18.6°
జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

బతికుండగానే చంపేశారు!

- బొమ్మనహాళ్‌కు చెందిన టీడీపీ సానుభూతిపరురాలు కురుబ తిప్పమ్మకు కె.రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి తో 35 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పట్లోనే ఊరు వదిలి కర్ణాటక రాష్ట్రం పావగడలో స్థిరపడ్డారు. అయితే ఓటు మాత్రం ఇక్కడే ఉంది. సీరియల్ నంబర్ 676, పోలింగ్ బూత్–50లో ఓటర్ ఐడీ (ఎస్‌ఎల్‌పి1359935) నంబర్‌తో నమోదైంది. ఈ ఓటు తొలగించాలని బీఎల్‌ఓ ఫారం–7 క్లైయిమ్ నమోదు చేసింది. ఇలాంటి సెటిలర్ ఓట్లు తొలగిపోకుండా టీడీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారు.
- రాయదుర్గం మండలం బీఎన్‌హళ్లి కి చెందిన టీడీపీ నాయకుడి కుమారుడు నగేష్ అనే వ్యక్తి పోలింగ్ బూత్ –237లో ఎస్‌ఎల్‌పి1016344 అనే ఓటరు ఐడీతో తండ్రి పేరు మార్చి నమోదు చేసుకున్నాడు. అలాగే 238 బూత్‌లోనూ ఎస్‌ఎల్‌పి 1181866 అనే ఓటరు ఐడీతో బి. తిమ్మప్ప అనే తండ్రి పేరుతో ఓటు కలిగి ఉన్నాడు. బీఎల్‌ఓ గుర్తించినా ఫారం–7 క్లైయిమ్ నేటికీ పెండింగ్‌లో ఉంది.

ఇలా ఒక్క రాయదుర్గం నియోజకవర్గంలోనే డబుల్ ఎంట్రీలు, మృతులు, వలసదారులు 32 వేల మందికి పైగా ఉన్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్తించి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

- ఉనికి చాటుకునేందుకు టీడీపీ నేతల పాట్లు
- బతికున్న 1,522 మంది పేర్లు మృతుల జాబితాలోకి
- 4,700 మందికి పైగా డబుల్ ఎంట్రీ పేరుతో ఫిర్యాదు
- అందులో 1,021 మంది మాత్రమే డబుల్ ఎంట్రీగా నిర్ధారణ
- తెలుగుదేశం పార్టీ అనుకూల ఓటర్లపై ఒక్క ఫిర్యాదూ లేదు



టీడీపీ నేతల ఫిర్యాదులపై రెవెన్యూ అధికారుల విచారణలో తేలిన నిజాలు..

నియోజకవర్గం	ఫిర్యాదులు	మృతి చెందిన వారు	వలస ఓటర్లు	డబుల్ ఎంట్రీ
రాయదుర్గం	6,130	3,947	423	130
గుంతకల్లు	9,582	3,077	1,293	546
శింగనమల	1,904	650	109	08
అనంతపురం	1,803	364	786	247
కళ్యాణదుర్గం	6,416	3,483	203	90

టీడీపీ నేతలు చేసిన ఆరోపణలు తప్పని తేలినవి

నియోజకవర్గం	నిజమైన ఓటర్లు
రాయదుర్గం	1,630
గుంతకల్లు	4,666
శింగనమల	1,137
అనంతపురం	406
కళ్యాణదుర్గం	2,640

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తెలుగుదేశం పార్టీ నేతల దిగజారుడుతనం మరోసారి బయటపడింది. దొంగే దొంగ దొంగ అని అరిచినట్టు జనంలో నవ్వుల పాలయ్యారు. ఓటర్ల జాబితాలపై ఆరోపణలు గుప్పించి అభాసుపాలైన తీరు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. బతికున్న ఓటర్లనూ మరణించిన వారి జాబితాలో చేర్చారు. రెండు చోట్ల ఓట్లు ఉన్న వారు, నకిలీ ఓటర్లు ఇలా పలు అంశాలపై టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. వీటన్నిటిపైనా కలెక్టర్ విచారణ జరిపారు. ఇందులో పలు ఫిర్యాదులు తప్పుడువని తేలింది. విచిత్రమేమంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే దొంగ ఓట్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టడం.

బతికున్న వారిని చంపేశారు

ఏదో ఒకరకంగా వైఎస్సార్‌సీపీపై బురద జల్లాలనే ఉద్దేశంతో తెలుగుదేశం నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేశారు. వీటిపై కలెక్టర్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో విచారణ చేపట్టారు. ఈ విచారణలో తేలిన విషయం ఏమిటంటే.. బతికి ఉన్న 1,522 మంది ఓటర్లను చనిపోయిన వారి జాబితాలో చేర్చారు. తెలుగుదేశం పార్టీకి వీళ్లందరూ ఓటు వేయరనే ఉద్దేశంతోనే ఇలా చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఐదు నియోజకవర్గాల్లో 4,726 మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటిని పరిశీలిస్తే 3,703 మందికి ఒక చోటే ఓట్లు ఉన్నాయి. 1,021 మంది మాత్రమే డబుల్ ఎంట్రీ ఉన్నట్టు తేలింది. ఇలా ప్రతి అంశంలోనూ టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదులు దురుద్దేశంతో కూడుకున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల ముఖ్య అధికారికి నివేదిక

ఐదు నియోజక వర్గాల్లో వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్.. రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారికి లేఖ రాశారు. ఫారం–7 పేరుతో ఇచ్చిన ఫిర్యాదులన్నిటిపైనా విచారణ జరిపామని నివేదికలో పేర్కొన్నారు. తమ విచారణలో వెలుగులోకి వచ్చిన మృతుల ఓట్లను, డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించామని నివేదించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిశీలించగా..ఇందులో మచ్చుకు కొన్ని మాత్రమే నిజమని, మిగతావన్నీ సక్రమంగానే ఉన్నట్టు తేలింది.

- ఇదిలా ఉండగా తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉండి, డబుల్ ఎంట్రీ, వలస వెళ్లిన ఓటర్లు, మృతిచెందిన ఓటర్లపై ఒక్క ఫిర్యాదూ చేయకపోవడం ఆ పార్టీ నేతల దిగజారుడుతనాన్ని బయటపెట్టిందని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని గతంలోనే ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, తాజాగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

న్యూస్‌రీల్

రేపు ఉద్యోగ మేళా



అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ ఉత్తీర్ణత/ ఫెయిల్ అయిన 32 సంవత్సరాల్లోపు వయసున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇందులో ఎంపికైన వారు ఉమ్మడి అనంతపురం జిల్లాలో గుంతకల్లు, రాయదుర్గం, అనంతపురం, తాడిపత్రి, పెనుకొండ, కదిరి, గోరంట్ల, హిందూపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండలోని ఫ్యూషన్ మైక్రోఫైనాన్స్ –ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ బ్రాంచుల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు జీతభత్యాలు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 63053 00106, 95506 76098, 83285 28338 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ పర్యటన

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమంలో భాగంగా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈఆర్‌ఓలతో ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు అనంతపురం అర్బన్‌లో క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై పరిశీలన, సూపర్ చెక్ నిర్వహిస్తారన్నారు. అదే క్రమంలో బీఎల్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలతో మాట్లాడతారన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పామిడి మండలం 246, 247, 248, 250 పోలింగ్ కేంద్రాల పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారన్నారు. అనంతరం అక్కడి నుంచి కర్నూలుకు వెళతారన్నారు.

బాక్సింగ్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో టీచర్లు

గార్లదిన్నె: ఈ నెల 11, 12, 13 తేదీల్లో జరిగిన 67వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో గార్లదిన్నె మోడల్ స్కూల్ విద్యార్థులు దివ్య నందీశ్వరి (స్వర్ణం), విజయ్‌సింహారెడ్డి (రజతం), స్నేహలత, శ్రీరామ్, నాని, నందీష్ గౌడ్ (కాంస్య) పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. అలాగే ఇంటర్ సీఈసీ రెండో సంవత్సరం విద్యార్థిని నందీశ్వరి అండర్–19లో 75–81 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులతో పాటు పీఈటీ వెంకటేష్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం అభినందించారు.

విద్యుదాఘాతంతో ఉప సర్పంచ్ మృతి



రాజ్యలక్ష్మి (ఫైల్)

పెద్దవడుగూరు : రావులుడికి పంచాయతీ ఉప సర్పంచ్ రాజ్యలక్ష్మి (34) విద్యుదాఘాతంతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... కోనాపురంలో నివాసముంటున్న రాజ్యలక్ష్మి సోమవారం ఉదయం ఇంటి ముందర శుభ్రం చేసుకుంటోంది. మెట్లపై శుభ్రం చేసేందుకని స్టేర్‌కేస్‌ను పట్టుకుని పైకి ఎక్కుతుండగా విద్యుత్ షాక్ కొట్టగానే కిందకు పడిపోయింది. అపస్మారకస్థితికి చేరుకున్న ఆమెను కుటుంబ సభ్యులు రాయలచెరువులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే రాజ్యలక్ష్మి చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

నేడు జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హై స్కూలులో మంగళవారం జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్‌ఫేర్) నిర్వహిస్తున్నట్లు డీఈఓ వి.నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 76 ప్రాజెక్టులు ఈ ప్రదర్శనల్లో పాల్గొంటాయని వెల్లడించారు.

సంతృప్తికర పరిష్కారం చూపాలి

- అధికారులకు డీఆర్‌ఓ గాయత్రీదేవి ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా అందే అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలని డీఆర్‌ఓ గాయత్రీదేవి జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. ఏ దశలోనూ అర్జీలను నిర్లక్ష్యం చే యకూడదని చెప్పారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో డీఆర్‌ఓతో పాటు ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 403 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో డీఆర్‌ఓ సమీక్షించారు. 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. అర్జీదారుకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు.

అర్జీల్లో కొన్ని...

- గ్రూప్1, 2 ఉద్యోగాలకు అభ్యర్థుల వయోపరిమితిని 42 నుంచి 44 ఏళ్లకు పెంచాలని ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కుళ్లాయిస్వామి, సంతోష్‌కుమార్, ఆనంద్ కుమార్ అర్జీ అందజేశారు.
- ది ఉరవకొండ కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వారు గడువు ముగిసినా డిపాజిట్ సొమ్మును చెల్లించడం లేదని ఖాతాదారులు శ్రీనివాసులు, జయశీల, తదితరులు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి తమ డిపాజిట్లు చెల్లించేలా చూడాలని కోరారు.

ఆరోగ్యశ్రీ వ్యయం పెంపు చరిత్రాత్మకం

- ఉచిత వైద్యంపై విస్తృత అవగాహన కల్పిస్తాం
- కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



లబ్ధిదారులకు కొత్త ఆరోగ్య శ్రీ కార్డులను అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎస్పీ అన్బురాజన్, మేయర్ వసీం

అనంతపురం అర్బన్: పేదలకు సంజీవని లాంటి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల వ్యయ పరిమితి రూ.25 లక్షల వరకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ముఖ్యమంత్రి సోమవారం తాడేపల్లిలోని తన కార్యాలయం నుంచి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం, ప్రతి ఇంటికీ వెళ్లిఆరోగ్యశ్రీపై అవగాహన కల్పిస్తూ కొత్త ఫీచర్లతో కూడిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు ఎస్పీ అన్బురాజన్, మేయర్ వసీం తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరమని అన్నారు. ఈ పథకం ద్వారా ఎంత పెద్ద వ్యాధి అయినా ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. జిల్లాలో 2019 జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ ద్వారా 3,13,392 మంది లబ్ధిపొందారన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.662.80 కోట్లు ఖర్చు చేసిందన్నారు. కోవిడ్ సమయంలో 15,662 మంది రోగులకు చికిత్స అందించారని, ఇందుకు రూ.52.142 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయించుకున్నవారికి ఆరోగ్య ఆసరా కింద రోజుకు రూ.225 ఇస్తూ గరిష్టంగా ఒక నెలకు రూ.5 వేలు ఇస్తోందన్నారు. ఆరోగ్య ఆసరా ద్వారా జిల్లాలో 97,412 మంది లబ్ధిదారులకు రూ.72.08 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఇలా పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ఉచితంగా వైద్యం అందిస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ యాప్‌ను 3,48,925 మంది డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు కొత్త ఫీచర్లతో రూపొందించిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆరోగ్య శ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకూ జగన్ సర్కారు భరోసా

- ఈ ఏడాది అత్యధికంగా 6,866 సీసీఆర్‌సీలు
- 2,055 మంది కౌలుదారులకు రైతు భరోసా
- 5,911 మందికి రూ.23.76 కోట్ల పంటరుణం



గుర్తింపు కార్డులు చూపుతున్న సోములదొడ్డి కౌలు రైతులు

అనంతపురం అగ్రికల్చర్: కౌలురైతులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు భరోసా కల్పిస్తోంది. సొంత భూమి లేకపోవడం లేదంటే తక్కువ విస్తీర్ణం కలిగిన రైతులు తోటి రైతులకు సంబంధించి భూములను తీసుకుని పంట సాగు చేసుకునే కౌలుదారులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తోంది. ఆర్‌బీకే వేదికగా భూయజమాని, సాగుదారుల మధ్య అవగాహనతో కూడిన అగ్రిమెంట్ కుదిర్చి... ఏటా పంటసాగుదారు పత్రం (క్రాప్ కల్టివేటర్ రైట్‌కార్డు – సీసీఆర్ కార్డు) జారీ చేస్తోంది. సీసీఆర్‌సీ తీసుకున్న సాగుదారులను కౌలు రైతులుగా అధికారికంగా గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి కొన్ని ప్రయోజనాలు వర్తింపజేస్తోంది.

6,866 మందికి సీసీఆర్‌సీలు

ఈ ఏడాది 6,170 మంది కౌలు రైతులను గుర్తించి సీసీఆర్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. అయితే అధికారులు 6,866 మంది కౌలుదారులను గుర్తించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ప్రత్యేక దృష్టి సారించడంతో లక్ష్యానికి మించి కౌలుదారులను గుర్తించినట్లు చెబుతున్నారు. ఏటా జూన్ నుంచి ఆగస్టు 15 మధ్య ఈ కార్యక్రమం చేపడుతూ కౌలుదారులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు. సీసీఆర్‌సీ పొందిన రైతులకు ఇన్‌పుట్‌సబ్సిడీ, పంటల బీమా, పంట రుణాల మంజూరు, సున్నావడ్డీ రాయితీ, ఇతరత్రా పంట నష్టం, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కూడా వర్తించేలా నిబంధనలు రూపొందించారు. ఈ ఏడాది ఇంత వరకు 2,055 మంది కౌలురైతులకు రూ.13,500 ప్రకారం వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద పెట్టుబడిసాయం జమ అయిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీపీఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. అర్హత కలిగిన 5,911 మంది కౌలుదారులకు బ్యాంకుల ద్వారా రూ.23.76 కోట్ల మేర పంట రుణాలు (క్రాప్ లోన్లు) పొందినట్లు తెలిపారు. జిల్లాలో ఉరవకొండ, వజ్రకరూరు, పామిడి, గుత్తి, నార్పల, పెద్దపప్పూరు, విడపనకల్లు, పెద్దవడుగూరు, అనంతపురం తదితర ప్రాంతాల్లో కౌలుదారులను గుర్తించినట్లు వెల్లడించారు.

కాన్వొకేషన్ పట్టా పొందేదెట్టా..?

- ఫీజు భారీగా పెంపు
- నిబంధనలు విస్మరించిన ఎస్కేయూ
- ఏకంగా రూ.వెయ్యి పెంపుదల
- విద్యార్థులపై పెను భారం



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవంలో పట్టా అందుకోవాలనుకున్న విద్యార్థులపై కాన్వొకేషన్ రుసుం పెంపు గుదిబండగా మారింది. 21వ స్నాతకోత్సవంలో రూ.2,500 ఉండే పట్టా (ఇన్ అడ్వాన్స్‌డ్) ఫీజు తాజాగా రూ.3,500కు పెంచింది. ఒకేసారి రూ.1000 ఫీజు పెంచడం భారంగా పరిణమించింది. 21వ స్నాతకోత్సవ రుసుం 2023 జూలై 20 వరకు ఉంది. ఈ స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నేరుగా వారి ఇంటికే పట్టాలు పంపుతారు. తాజాగా ఉత్తీర్ణత చెందిన వారు ఇన్‌అడ్వాన్స్‌డ్ కింద స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకుంటారు. 22వ స్నాతకోత్సవం వరకు నిరీక్షించకుండా ముందుగానే డిగ్రీలు తీసుకుంటారు. ఉన్నత కోర్సుల్లో అడ్మిషన్లు రావడం, ప్రైవేట్ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం తదితర అంశాల నేపథ్యంలో ఇన్‌అడ్వాన్స్‌డ్ కింద దరఖాస్తుకు ఆసక్తి చూపుతుంటారు. వాస్తవానికి ప్రతి స్నాతకోత్సవానికీ 10 శాతం మేర ఫీజు పెంచుకోవచ్చన్న నిబంధన ఉన్నప్పటికీ దానిని విస్మరించి ఏకంగా రూ.1000 మేర ఫీజు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం విమర్శలకు దారితీస్తోంది. దూరవిద్య డిగ్రీ పట్టాకు రూ.4200, దూరవిద్య పీజీ ఇన్‌అడ్వాన్స్‌డ్ కింద రూ. 5400 మేర చెల్లించాల్సి ఉంది. 2023లో ఇన్ అడ్వాన్స్‌డ్ కింద ఏడు వేల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోనున్నారు. వీరిందరికీ ఆర్థికభారం కానుంది. ఫీజులు తగ్గించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇక్కడే ఫీజు తక్కువ!

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నిర్ధారించిన స్నాతకోత్సవ రుసుం రాష్ట్రంలోని ఇతర వర్సిటీల ఫీజుల కంటే తక్కువగా ఉంది. గతంలో ఎన్నడూ పెద్దగా పెంచలేదు. విద్యార్థులకు అందించే జవాబు పత్రాల రేటు విపరీతంగా పెరిగిపోయింది. పరీక్ష విభాగం అంటే పరీక్ష నిర్వహించినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించేంత వరకు పెద్ద మొత్తంలో నిధులు వినియోగించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఇతర యూనివర్సిటీలు నిర్ధారించిన మేరకే ఫీజులు నిర్దేశించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నాం.

– ప్రొఫెసర్ జీవీ రమణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, ఎస్కేయూనివర్సిటీ

కనులపండువగా జాతర

కుందుర్పి: మహంతపురంలో సోమవారం ఈరన్నస్వామి, చిత్రలింగేశ్వరస్వామి జాతర కన్నుల పండువగా జరిగింది. ఉదయం విశేష అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆంజనేయస్వామికి జ్యోతులు సమర్పించారు. ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లను తిప్పారు. సాయంత్రం ఈరన్న, చిత్రలింగేశ్వర స్వాముల ఉత్సవ మూర్తులను భారీ ఊరేగింపుతో గ్రామ శివారులోని ఈడు వద్దకు చేర్చి పూజలు చేశారు. ఈడు చుట్టూ ఆవులు, పశువులు, గొర్రెలతో ప్రదక్షిణ చేయించి మొక్కులు తీర్చుకొన్నారు. మంగళవారం పాతప్ప జాతరను పురస్కరించుకుని సాయంత్రం గ్రామ శాంతి, వెండి పల్లకీ ఉత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



ఈరన్నస్వామి, చిత్రలింగేశ్వరస్వాముల గ్రామోత్సవం



ఆంజనేయస్వామికి జ్యోతులు తీసుకెళుతున్న మహిళలు

రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తాం

- రెండు నెలల్లో సోమనాథ్‌నగర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల నోటిఫికేషన్‌కు మరో 90 రోజుల గడువు మాత్రమే ఉందని, ఈ లోపు అనంతపురం నగరంలో మిగులు అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. రెట్టింపు సంక్షేమాన్ని అందించడం ద్వారా ప్రజామద్దతుతో వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతపురంలోని 66, 69వ సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేసిన, చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బోర్డులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేసి మాట్లాడారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు చేసిన మోసాలను గుర్తు చేశారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎన్ని ఎదురైనా ఎక్కడేగాని సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగన్ ఆపలేదన్నారు. ప్రజలకు మేలు చేస్తుంటే గిట్టని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశాయన్నారు.

రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి 1,100 జబ్బులకు ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటే అదే బాటలో ఆ మహానేత తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ రూ.3 లక్షల వరకు పరిమితులున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షలకు చేశారని, తాజాగా ఊహకందని విధంగా రూ.25 లక్షల వరకూ పెంచి ఎలాంటి జబ్బుకైనా ఉచితంగా వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. అంతేకాక జబ్బు తీవ్రతను బట్టి నాలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందుకునే సౌలభ్యాన్ని కల్పించారన్నారు. డ్వాక్రా రుణాల మాఫీతో మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత కూడా వైఎస్ జగన్‌దేనన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే జగన్ అమలు చేస్తున్న పథకాలను ఆపి ప్రజలను ఇబ్బందుల్లో నెట్టేందుకు ప్రతిపక్ష ఆ పార్టీ పెద్దలు కాచుకుని ఉన్నారన్నారు. గతంలో పేదల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులను చేరువ చేస్తూ ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడితే దానిని టీడీపీ, జనసేన నేతలు అడ్డుకునే ప్రయత్నం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు.

నిధులు మళ్లించిన మాజీ ఎమ్మెల్యే:

నడిమివంకకు రక్షణ గోడలు ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వంలో రూ.18 కోట్లు మంజూరు చేయించుకున్న నిధులను అప్పటి ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి చెరువు కట్టకు మళ్లించి ఆ ప్రాంత వాసులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఫలితంగా ఇటీవల కురిసిన వర్షాలతో నడిమివంక ప్రాంత ప్రజలు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు. ఆ సమయంలో బాధితులకు అండగా ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందించిన సేవలను కొనియాడారు. భవిష్యత్తులో వరదలతో ఇబ్బందులు తలెత్తకూడదని నడిమివంక పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లితే రక్షణ గోడల ఏర్పాటుకు రూ.42 కోట్లు మంజూరు చేశారన్నారు. మరో రెండు నెలల్లో సోమనాథ్ నగర్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడడంతో ప్రతిపక్షాలు కుట్ర రాజకీయాలకు తెరతీశాయన్నారు. ఆ మాయలో చిక్కుకోకుండా మరోసారి వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనంతపురం నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ లింగాల శివశంకర్‌రెడ్డి, పార్టీ నగర నేత చింతా సోమశేఖర్‌రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు పీవీ రమణారెడ్డి, మధు, జేసీఎస్ కన్వీనర్ వీరారామకృష్ణారెడ్డి, ఎంఎల్‌ఓ అమర్‌నాథ్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు శ్రీనివాసులు, శేఖర్‌బాబు, డాక్టర్ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముమ్మర గాలింపు చర్యలు



గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

కూడేరు: మండల పరిధిలోని మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) బ్యాక్ వాటర్‌లో గల్లంతైన యువకుడి కోసం పోలీసుల గాలింపు చర్యలు రెండో రోజూ సోమవారమూ కొనసాగాయి. ఉరవకొండకు చెందిన ధనుంజయ కుమారుడు ఆర్య తన స్నేహితులతో కలసి ఆదివారం డ్యాం సందర్శనకు వెళ్లి బ్యాక్ వాటర్‌లో గల్లంతైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పోలీసులు మత్స్యకారులు, గజ ఈతగాళ్లను రంగంలో దించి ఆదివారం చీకటి పడే వరకూ గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సోమవారం ఉదయం కూడేరు ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది నేతృత్వంలో విస్తృత గాలింపు చర్యలు కొనసాగాయి. చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపి వేశారు. మంగళవారం తిరిగి గాలింపు చేపడతామని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు. కాగా, ఆర్య గల్లంతు విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆదివారం నుంచి అక్కడే రోదిస్తూ ఉన్నారు.

బీడీలు ఇవ్వలేదని వేడినూనెతో దాడి



చికిత్స పొందుతున్న షఫీ

బొమ్మనహాళ్: బీడీలు ఇవ్వలేదన్న అక్కసుతో వేడి నూనెతో దాడి చేసిన ఘటన బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరులో చోటు చేసుకుంది. వివరాలు... దర్గాహొన్నూరుకు చెందిన షఫీ చిల్లరు దుకాణంతో పాటు చికెన్ కబాబ్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడు రాజశేఖర్ ఆదివారం రాత్రి బీడీల కోసం షఫీ చిల్లర దుకాణానికి వచ్చాడు. ఆ సమయంలో చికెన్ కబాబ్ చేస్తున్న షఫీ కాసేపు వేచి ఉండాలన్నాడు. దీంతో రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ చికెన్ కబాబ్ చేస్తున్న షఫీపై బాణలిలోని వేడి నూనెను చల్లాడు. ఘటనలో షఫీతో పాటు అక్కడే ఉన్న కుటుంబసభ్యులు ఆఫీబా తబ్సుమ్, రుహినాతాజ్, అస్లాంబాషా, మహమ్మద్ ముజ్మల్ గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే బంధువులు బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన షఫీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

కాపురానికి వెళ్లమంటే పిల్లలతో కలసి అదృశ్యమైంది!

రాప్తాడు రూరల్: భర్తతో గొడవపడి పుట్టింటికి చేరుకున్న కుమార్తెను తల్లిదండ్రులు మందలించి, బుద్ధిగా కాపురం చేసుకోమని చెప్పి పంపితే పిల్లలతో కలసి వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరినగర్‌కు చెందిన వడ్డే రాము కుమార్తె వాణిని బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన వడ్డే శేఖర్‌కు ఇచ్చి వివాహం చేశారు. దంపతులు అన్యోన్యంగా ఉండేవారు. వీరికి ఐదేళ్ల వయసున్న కుమార్తె వి.ఉజ్వల, నాలుగేళ్ల వయసున్న కుమారుడు వి.పృథ్వీరాజ్ ఉన్నారు. ఇటీవల మనస్పర్థల కారణంగా దంపతులు తరచూ గొడవ పడసాగారు. ఈ క్రమంలో పది నెలల క్రితం వాణి పుట్టింటికి చేరుకుంది. రోజులు గడుస్తున్నా కాపురానికి వెళ్లకపోవడంతో సోమవారం తల్లిదండ్రులు మందలించారు. దీంతో తాను భర్త వద్దకు వెళుతున్నట్లు చెప్పి ఉదయం 9 గంటలకు పిల్లలను పిలుచుకుని ఇంటి నుంచి వాణి బయలుదేరింది. మధ్యాహ్నం అల్లుడికి ఫోన్ చేసి ఆరా తీస్తే వాణి అక్కడకు చేరుకోలేదని తెలిసి తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో ఆరా తీశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం రాత్రి రాము ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96811 (సీఐ), 93469 17102 (ఎస్‌ఐ) నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

కారు బోల్తా - ఒకరి మృతి

పెనుకొండ రూరల్: కారు బోల్తా పడిన ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. వివరాలు.. హిందూపురం పట్టణానికి చెందిన హసీబా కౌసర్(55) తన కుటుంబ సభ్యుడితో కలసి సోమవారం రాత్రి కారులో అనంతపురానికి బయలుదేరారు. పెనుకొండ మండలం దుద్దేబండ క్రాస్ సమీపంలోకి చేరుకోగానే కారు టైర్ పేలడంతో వాహనం పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. ఘటనలో హసీబా కౌసర్ అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న ఇలియాజ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాజకీయ కక్షతోనే ఆరోపణలు

- భూ కబ్జా అంశంపై విచారణకు సిద్ధం
- ఆంధ్రజ్యోతి, ఈనాడు కథనాలపై స్పందించిన పైలా



తాడిపత్రి అర్బన్: రాజకీయ కక్షతోనే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. సోమవారం తాడిపత్రిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను భూ కబ్జాకు పాల్పడినట్లుగా ఈనాడు, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలను ఖండించారు. వాస్తవాలు తెలుసుకోకుండా కథనాలు ప్రచురించడం జర్నలిజం ప్రాథమిక సిద్ధాంతానికి విరుద్ధమనే కనీస ఇంగిత జ్ఞానం కూడా లేకుండా తప్పుడు వార్తలు ప్రచురించారంటూ ధ్వజమెత్తారు. తాడిపత్రి మండలం యర్రగుంటపల్లిలో సర్వే నెంబర్ 1071-1లోని 10 ఎకరాల భూమిని 2009లోనే తాను కొనుగోలు చేశానని గుర్తు చేశారు. ఈ భూమికి సంబంధించి 1964 నుంచి లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయని వివరించారు. అగ్రికల్చర్ నుంచి కమర్షియల్‌కు ల్యాండ్ కన్వర్షన్ చేశారన్నారు. దీనిపై జిల్లా సర్వేయర్, స్థానిక తహసీల్దార్లు సర్వే చేసి ఈ భూమి పైలా నరసింహయ్య, సతీమణి రమాదేవికి చెందినదిగా ధ్రువీకరణ పత్రం కూడా ఇచ్చారన్నారు. ఇదే అంశంపై తాను బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు సిద్ధమని, దమ్ముంటే తప్పుడు కథనాలు ప్రచురించిన వారు ఆలయంలో ప్రమాణానికి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. భూమి కబ్జా అంశంపై ఎలాంటి విచారణకైనా సిద్ధమన్నారు. తాను 34 సంవత్సరాలుగా తాడిపత్రి రాజకీయాల్లో కొనసాగుతున్నానని గుర్తు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా వచ్చిన లాభంలో 10 శాతాన్ని పైలా ఫౌండేషన్ పేరుతో సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నానన్నారు. 1998లో తన స్వగ్రామమైన వెంకటాంపల్లిలో 32 ఎకరాల సొంత భూమిని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఒక్కొక్కరికి 1.30 ఎకరాల చొప్పున ఉచితంగా పంపిణీ చేశానన్నారు. రాజకీయంగా తన ఎదుగుదలను చూసి ఓర్వలేక తప్పుడు కథనాలు ప్రచురించడం భావ్యం కాదన్నారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు సతీష్ కుమార్

అనంతపురం క్రైం: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా పాములపాడు మండలం మట్టాడు గ్రామానికి చెందిన ఎ.రాముడు కుమారుడు సతీష్ కుమార్ (27) బీటెక్ పూర్తి చేసి, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా అనుబంధ హుండాయ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితులతో కలసి అనంతపురంలోని బుడ్డప్పనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. నాలుగు నెలల క్రితం అందరూ తలా ఓ వైపు వెళ్లిపోవడంతో సతీష్ ఒక్కడే ఆ ఇంట్లో ఉంటున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ సోమవారం ఉదయం 11 గంటలకు తన చిన్ననాటి స్నేహితులైన వసుధ, శివకృష్ణకు వేర్వేరుగా వీడియో కాల్ చేసి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపి ఫోన్ కట్ చేశాడు. దీంతో స్నేహితులిద్దరూ వారుంటున్న ప్రాంతం నుంచి సతీష్ గదికి చేరుకునేలోపు లోపల తలుపునకు గడి పెట్టుకుని వైరుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. స్థానికుల సహకారంతో సతీష్‌ను కిందకు దించి వెంటనే ఆటోలో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న సతీష్ తల్లిదండ్రులు సోమవారం సాయంత్రం అనంతపురానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

అనంతపురం క్రైం: వివాహిత ఆత్మహత్యాయత్నం చేసిన కేసులో అత్తింటి వారి వేధింపుల కేసును పోలీసులు నమోదు చేశారు. వివరాలను దిశ డీఎస్పీ ఆంథోనప్ప వెల్లడించారు. అనంతపురంలోని రహమత్‌నగర్‌కు చెందిన ఓబులేసు కుమార్తె ఆదిలక్ష్మికి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం మద్దలపల్లికి చెందిన ఆనంద్‌తో 2009లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అనంతరం బతుకు తెరువు కోసం పదేళ్ల క్రితం అనంతపురానికి వలస వచ్చి కోవూరునగర్‌లో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఆనంద్ తాగుడుకు అలవాటు పడి వివాహేతర సంబంధాలు ఏర్పరుచుకుని తరచూ భార్యను హింసించేవాడు. తన జల్సాల కోసం డబ్బు తీసుకురావాలంటూ భార్యతో పాటు ఆమె తల్లిదండ్రులు చౌడమ్మ, రామాంజనేయులును వేధిస్తూ వచ్చాడు. మూడు తులాల బంగారు నగలు, 20 తులాల వెండి ఇచ్చి తమ కుమార్తెను చక్కగా చూసుకోవాలని ఆదిలక్ష్మి తల్లిదండ్రులు హితవు పలికారు. అప్పటికీ సంతృప్తి చెందని ఆనంద్ నాలుగురోజుల క్రితం భార్యతో గొడవపడి ఆమెను ఇంటి నుంచి బయటకు గెంటేశాడు. దీంతో పుట్టింటికి చేరుకున్న ఆమె ఆదివారం తన బంగారు, వెండి వస్తువులు తెచ్చుకునేందుకు భర్త ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో భర్తతో పాటు అత్తమామలు అవమానకరంగా మాట్లాడడంతో మనస్తాపం చెందిన ఆదిలక్ష్మి అదే రోజు రాత్రి విషపూరిత ద్రావకం తాగింది. కుటుంబసభ్యులు ఆమెను ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్తింటి వారిపై వేధింపుల కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టినట్లు దిశ పోలీసులు తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి



వరలక్ష్మి (ఫైల్)

పెద్దపప్పూరు: మండలంలోని ధర్మాపురం గ్రామ నివాసి వరలక్ష్మి (55) సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పెద్ద పప్పూరు నుంచి ధర్మాపురం వెళ్లే రహదారి సమీపంలోని ఓ మొక్కజొన్న తోటలో పడి ఉన్న ఆమె మృతదేహాన్ని గమనించిన రైతు వెంటనే సమాచారం అందించడంతో ఎస్‌ఐ శరత్ చంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుమార్తె జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చోరీ చేస్తూ పట్టుబడ్డ యువకుడు



పోలీసులు అదుపులో ఉన్న భీమయ్య

గుంతకల్లు: దుకాణంలో చోరీ చేస్తూ ఓ యువకుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఆద్యంతం సినిమాను తలపించే రీతిలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. గుంతకల్లులోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంత మార్కెట్ సమీపంలోఆదివారం అర్ధరాత్రి ఇల్లూరు గోపాలకృష్ణ జనరల్ స్టోర్స్ వద్ద ఉన్న మంచి నీటి కొళాయి వద్దకు నీరు పట్టుకునేందుకు స్థానికుడొకరు చేరుకున్నారు. ఆ సమయంలో స్టోర్స్ లోపల నుంచి శబ్దాలు రావడం గమనించిన ఆయన వెంటనే స్టోర్స్ యజమాన్ని ఇల్లూరు లక్ష్మీనారాయణకు ఫోన్ చేసి తెలిపాడు. అప్రమత్తమైన ఆయన వెంటనే టూటౌన్ పోలీసులకు ఫోన్ ద్వారా విషయం తెలియజేయడంతో ఎస్‌ఐ నరేంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అక్కడకు చేరుకున్న యజమానితో కలసి లోపల నుంచి శబ్దాలు వస్తుండడం గమనించిన పోలీసులు దుకాణానికి ఇరువైపులా కొందరిని కాపలాకు ఉంచి ఓ కానిస్టేబుల్‌ను లోపలకు పంపారు. ఆ సమయంలో లోపల ఉన్న యువకుడు కత్తి చూపించి బెదిరించడంతో కానిస్టేబుల్ వెంటనే బయటకు వచ్చి మరో ఇద్దరు కానిస్టేబుళ్లను లోపలకు పిలుచుకెళ్లాడు. దుండగుడు కనిపించకపోవడంతో దుకాణం మొత్తంగా గాలించి అటకపై దాక్కొన్న విసయం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం పట్టుబడిన యువకుడిని విజయవాడకు చెందిన కాపు భీమయ్యగా గుర్తించారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను దుకాణ యజమానితో పాటు పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అభినందించారు.

భార్య మౌనం.. భర్త బలవన్మరణం



మల్లికార్జున (ఫైల్)

యాడికి: భార్య మాట్లాడకుండా మౌనం వహించడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి గ్రామానికి చెందిన వంశరాజుల రామన్న కుమార్తె లక్ష్మికి ఉరవకొండకు చెందిన మారన్న పెద్ద కుమారుడు మల్లికార్జున (26)తో 2020లో వివాహమైంది. వీరికి 8 నెలల వయసున్న కుమార్తె ఉంది. ఎలక్ట్రికల్ పనులతో పాటు వెహికల్ డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడడంతో మానేయాలని భార్య కోరింది. సరేనంటూ అంగీకరించిన మల్లికార్జున అప్పుడప్పుడు మద్యం తాగి ఇంటికి చేరుకునేవాడు. ఈ నెల 13న భర్తతో కలసి యాడికిలోని పుట్టింటికి లక్ష్మి వచ్చింది. మూడు రోజుల పాటు ఎంతో సరదాగా గడిపారు. ఆదివారం సాయంత్రం మల్లికార్జున మద్యం సేవించి ఇంటికి చేరుకోవడంతో పుట్టింటి వారి ముందు తన పరువు పోయిందంటూ లక్ష్మి బాధపడింది. తన భర్త గురించి ఎంతో మంచిగా తల్లిదండ్రులతో చెప్పుకున్నానని, ఈ రోజు తాగి వచ్చి పరువు తీశావంటూ మదనపడుతూ తనతో మాట్లాడవద్దంటూ మౌనం దాల్చింది. దీంతో మనస్తాపానికి గురైన మల్లికార్జున అదే రోజు రాత్రి 10 గంటలకు తండ్రి మారన్నకు ఫోన్ చేసి లక్ష్మి తనతో మాట్లాడడం లేదని, ఇక తాను బతికి ఉండడం వృథాగా భావించి ఆత్మహత్య చేసుకుంటున్నాని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. వెంటనే కోడలికి మారన్న ఫోన్ చేసి విషయం తెలపడంతో రామన్న కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. చివరకు ఇంటి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ కట్టడంలో లుంగీతో వేసుకున్న ఉరికి వేలాడుతున్న మల్లికార్జునను గమనించి, స్థానికుల సాయంతో కిందకు దించారు. కొన ఊపిరితో ఉండడం గమనించి వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మల్లికార్జున మృతి చెందినట్లు నిర్ధారించారు. కోడలు ద్వారా సమాచారం అందుకున్న మారన్న కుటుంబసభ్యులు యాడికికి వచ్చి మల్లికార్జున మృతదేహంపై పడి బోరున విలపించారు. మృతుడి తండ్రి మారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

'పోలీసు స్పందన'కు 142 వినతులు



పిటీషనర్లతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించి స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 142 వినతులు అందాయి. ఎస్పీ అన్బురాజన్ స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న పిటీషన్లపై స్పందిస్తూ తక్షణ న్యాయం చేకూర్చాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ఎలాంటి సమస్యలున్నా జిల్లా పోలీసు స్పందన విభాగానికి (93929 26803) ఫోన్ చేసి తెలిపితే వెంటనే స్పందిస్తామని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, దిశ డీఎస్పీ ఆంథోనప్ప, ఎస్‌బీ సీఐ ఇందిర పాల్గొన్నారు.

జనవాక్కు

పేదలంతా జగన్ వెంటే



గతంలో ఏ ప్రభుత్వమూ పేదల బాగోగులు పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్ ఒక్కరే అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారు. నాకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. వైఎస్సార్ చేయూత పథకం కింద నా భార్య శశిరేఖకు ఏటా 18,750, వైఎస్సార్ ఆసరా పథకం కింద ఏటా రూ.7వేలు చొప్పున లబ్ధి చేకూరింది. రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందజేశారు. ఈ మొత్తంతో పెట్టుబడి లేని వ్యవసాయం చేసి లాభపడ్డాం. ఆర్థిక ఇబ్బందులు తీరాయి. పేదలకు ఎంతో మేలు చేసిన జగన్‌ను ఎవరూ మరిచి పోలేదు. అందుకే పేదలంతా జగన్ వెంటే నిలుస్తున్నారు.

– రాకెట్ల శ్రీరాములు, రాజీవ్ కాలనీ, వజ్రకరూరు

పిల్లల చదువుకు ఢోకా లేదు



నేను, నా భర్త గంగరాజు కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూలీ డబ్బుతో కుటుంబ పోషణే భారంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మా పిల్లల చదువులు ఎట్లా అని బాధపడేవాళ్లం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ బడుల్లోనే ఇంగ్లిష్ మీడియం చదువులు ప్రవేశపెట్టి సీఎం జగనన్న ఎంతో మేలు చేశారు. అంతేకాక అమ్మ ఒడి పథకం లబ్ధి చేకూరడంతో పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా పోయింది. డబ్బున్న పిల్లలతో సమానంగా మా పిల్లలూ ఊరి బడిలోనే ఇంగ్లిష్ చదువులు చదువుతుంటే ఎంతో ఆనందంగా ఉంది.

– గంగాదేవి, పుప్పాల, యాడికి మండలం

లక్షాధికారిని చేశారు



నా భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన సంపాదన ఇంటి బాడుగ, కుటుంబపోషణకు సరిపోయేది కాదు. సొంతిల్లు కోసం గత ప్రభుత్వంలో చేయని ప్రయత్నమంటూ లేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లి గార్లదిన్నె రైల్వే స్టేషన్ సమీపంలో రూ.లక్షలు విలువ చేసే ఇంటి స్థలానికి పట్టా తీసుకొచ్చి ఇచ్చాడు. ఆ స్థలంలోనే ప్రభుత్వ సహకారంతో ఇల్లు కూడా నిర్మించుకున్నాం. సొంతింట్లో ఎంతో సంతోషంగా జీవిస్తున్నాం. పూట గడవక ఇబ్బంది పడే స్థితి నుంచి నన్ను లక్షాధికారిని చేసిన సీఎం వైఎస్ జగనన్నకు ఎంతో రుణపడి ఉన్నాం.

– అనిత, గార్లదిన్నె

మేలు జరిగింది



సీఎం వైఎస్ జగన్‌తోనే మా కుటుంబానికి మేలు జరిగింది. ఎలాంటి సిఫారసు లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాయి. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికీ అండగా నిలవాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన ఓబీసీ పథకం ద్వారా నా భార్య వసుంధరకు ఏటా రూ.15వేల లబ్ధి చేకూరుతోంది. ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణమూ మంజూరు చేశారు. ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయి. పేదలకు మంచిచేసే వైఎస్ జగనే సీఎంగా ఉండాలి.

– శ్రీనివాసరావు, బ్రాహ్మణవీధి, వజ్రకరూరు

పరుపుల దుకాణం దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్‌మెన్‌లు

అనంతపురం క్రైం: నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో సీమా ఆప్టికల్స్ పక్కనే ఉన్న పరుపుల దుకాణంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం రాత్రి 8.45 గంటలకు మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. దుకాణదారు బాషా సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే దుకాణంలోని పరుపులు, ముడిసరుకు కాలి బూడిదైంది. దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న నగర మేయర్ వసీం అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడిని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

విద్యార్థిని ఆత్మహత్య

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం ఎ.కొండాపురం గ్రామానికి చెందిన కవిత (21) బీకేఎస్ మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కాగా, విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఏడుగురిపై కేసు నమోదు

పెద్దవడుగూరు: ఇరువర్గాల ఘర్షణలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు... పెద్దవడుగూరు మండలం దిమ్మగుడికి చెందిన మల్లికార్జున, రామదాసు కుటుంబాల మధ్య స్థల వివాదం నడుస్తోంది ఈ క్రమంలో రెండు కుటుంబాల వారు ఆదివారం పరస్పర దాడులకు తెగబడ్డారు. ఘటనలో ఇరువర్గాల వారికీ గాయాలయ్యాయి. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



సిద్దరాంపురానికి వెళ్లే దారిలో బైపాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు నుంచి సిద్దరాంపురం వెళ్లే బైపాస్ మలుపు వద్ద ప్రజా ప్రతినిధులు, పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. మూడు రోజుల క్రితం ఆత్మకూరు నుంచి సిద్దరాంపురానికి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, కారు ఢీ కొని, తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, గ్రామస్తులు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆందోళన చేశారు. సోమవారం ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, సీఐ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యం

రాప్తాడు: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, సైన్సు పట్ల ఆసక్తిని కలిగించడానికే జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి ట్యాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మల్లికార్జున, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి ట్యాలెంట్ టెస్ట్ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 21న రాప్తాడులోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉదయం 10 గంటలకు మండల స్థాయి చెకుముకి ట్యాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు.

ఎస్ఎస్‌బీఎన్ అధ్యాపకులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు



డాక్టర్ నల్ల ఓబిరెడ్డి



వాదులపల్లి ఫిరోజ

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన్ గురు పురస్కారాలు– 2023కు ఎంపికయ్యారు. డాక్టర్ చివుకుల హనుమంతరావు ట్రస్ట్, సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పురస్కారాలను ఇటీవల గుంటూరులో అందించారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ నల్ల ఓబిరెడ్డి, వాదులపల్లి ఫిరోజ అవార్డులు అందుకున్నారు. అధ్యాపకులు డాక్టర్ నల్ల ఓబిరెడ్డి, వాదులపల్లి ఫిరోజ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన అవార్డులకు తమను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రవాణా రంగ కార్మికులు

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రవాణా రంగం కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముర్తుజా, నాయకుడు ముస్కిన్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి సబ్సిడీతో ఇవ్వాలన్నారు. ఈ చలానాలు రద్దు చేయాలన్నారు. ప్రైవేటు ఫైనాన్స్‌లకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా వాహనాలకు రుణం ఇవ్వాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులందరికీ ప్రమాద బీమా కల్పించాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ గాయత్రిదేవికి నాయకులు వినతిపత్రం అందజేశారు.

మెడికల్ రెప్స్ సమ్మె రేపు



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: ఈనెల 20న జాతీయ సమ్మె నిర్వహించనున్నట్లు మెడికల్ రెప్స్ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక జీవీవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. సంఘం సహాయ ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడారు. మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ తీసివేయాలన్నారు. అత్యవసర, కామన్‌డ్రగ్స్ ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ, నాసిరకం మందులు అరికట్టాలన్నారు. ఎస్‌పీఈ చట్టం, సెల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలన్నారు. వ్యక్తిగత గోప్యతకు ఆటంకపరుస్తున్న డిజిటల్ విధానాలను, ట్రాకింగ్‌ను ఆపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, సంఘం నాయకులు మంజునాథ్, సురేంద్ర, ఇసాక్, రామసుబ్బారెడ్డి, అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

అభిమానం.. అంబరం



జన హృదయనేతకు 'మహాలక్ష్మి' జేజేలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఈనెల 21న జరగనున్నాయి. తమ ప్రియతమ నేత జన్మదినాన్ని పురస్కరించుకొని అభిమానుల సంబరం అంబరమంటుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. నగరంలోని వివిధ కూడళ్లలో అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటు చేశారు. సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్, శ్రీకంఠం సర్కిల్, పాతూరు, ఇలా నగరంలోని పలు ప్రాంతాల్లో జననేతకు జన్మదిన శుభాకాంక్షలు చెప్తూ మహాలక్ష్మి శ్రీనివాస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, భారీ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మరికొందరు నాయకులు కూడా అభిమానాన్ని చాటుతూ ఆయా ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, జగనన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

– అనంతపురం కార్పొరేషన్



జననేతపై నిలువెత్తు అభిమానం..



సమయం ఆసన్నమవుతోంది.. ప్రియతమ నేత జన్మదిన పండుగకు..



నగరం నిండుగా..అభిమాన తరంగం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఐటీ అభివృద్ధి

- పార్టీ ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ మంజునాథ్



విలేకరులతో మాట్లాడుతున్న ఐటీ విభాగం నాయకుడు మంజునాథ్‌యాదవ్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఐటీ రంగం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ మంజునాథ్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లో మీడియాలో ఐటీ రంగంపై వచ్చిన కథనాన్ని ఆయన తప్పుబట్టారు. ఐటీ ఎగుమతుల్లో ఏపీ గణనీయమైన వృద్ధి సాధించిందన్నారు. 2018–19లో ఐటీ ఎగుమతులు రూ.986 కోట్లు ఉంటే, 2022–23 నాటికి ఏపీలో ఐటీ ఎగుమతులు రూ.1,867 కోట్లకు చేరిందన్నారు. నాలుగేళ్లలో ఏపీలో 10,192 మందికి కొత్తగా ఐటీ ఉద్యోగాలు వచ్చాయన్నారు. కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై బురద జల్లేందుకు ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఎన్ని చౌకబారు రాజకీయాలు, కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో ఐటీ విభాగం నాయకులు చంద్రమోహన్ రెడ్డి, బయపురెడ్డి, సుబ్బు, శ్రీకాంత్, శరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరషష్ఠి



పేరూరులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: మార్గశిరమాసంలో తొలి సోమవారం వచ్చిన పండుగ సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలను నగరంలో పలుచోట్ల ఘనంగా జరిపారు. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని అన్నపూర్ణ మంజునాథేశ్వరాలయంలో మధ్యాహ్నం అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవల అనంతరం శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యషష్ఠి స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. మారుతీనగర్‌లోని కోదండ రామాలయం, పాతూరు చెరువుకట్టపై వెలసిన సుబ్రమణ్య స్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు నయనానందకరంగా నిర్వహించారు.

రామగిరి: మండలంలోని పేరూరులో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, హోమాలు నిర్వహించారు. పెన్నానది ఒడ్డున ఉన్న స్వామికి ఈ ఏడాది నూతనంగా రథాన్ని భక్తుల సహాయంతో కొనుగోలుచేసి, ఊరేగించారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. అంతకుముందు శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

గుంతకల్లు: స్థానిక సత్యనారయణపేటలోని అదెప్ప బావి సమీపంలో సుబ్రహ్మణేశ్వర షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాకారోత్సవం అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఇన్‌వర్టర్ వితరణ

అనంతపురం కల్చరల్: లైఫ్‌కేర్ పెట్ జోన్ నిర్వాహకులు రిఫత్, జైనుల్ అబిదిన్ ఆదరణ సేవా సమాజ్ ఆశ్రమానికి ఇన్‌వర్టర్‌ను సోమవారం అందించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీనియర్ కవులు తరిమెల అమరనాథరెడ్డి, నబిరసూల్ చేతుల మీదుగా ఆశ్రమ నిర్వాహకులు తాడిమర్రి లాల్‌బాషాకు నిత్యావసర వస్తువులు, ఇన్‌వర్టర్ అందించారు.

4,25 తేదీల్లో బాల విహార్ సేవకుల శిక్షణ సదస్సు

అనంతపురం కల్చరల్: చిన్మయ జగదీశ్వరాలయంలో ఈనెల 24, 25 తేదీల్లో బాల విహార్ సేవకుల శిక్షణ సదస్సు జరగనుంది. సోమవారం తపోవనంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామి ఆత్మవిదానంద సరస్వతి, సీనియర్ గాయకుడు పాలసముద్రం నాగరాజు వివరాలు అందించారు. ప్రతి ఆదివారం గంటన్నర సేపు పిల్లలకు ఆటపాటలు, భగవద్గీత శ్లోకాలు, నైతిక విలువలను నేర్పే కథా గమనం, భారత, భాగవతాల్లోని పద్యాలను హృద్యంగా నేర్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9440442466, 8121276126లో సంప్రదించాలని కోరారు.

'మా భూమికి పట్టా చేయించుకున్నారు'

చెన్నేకొత్తపల్లి: తాము సాగులో ఉన్న భూమిని టీడీపీ హయాంలో మాజీ మంత్రి పరిటాల సునీత ప్రోద్బలంతో పట్టా చేయించుకొని, దౌర్జన్యం చేస్తున్నామని మాపైన ఆరోపించడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. నామాల గ్రామానికి చెందిన రమాదేవి, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామన్నలు విలేకరులతో మాట్లాడారు. నామాల గ్రామంలో గత 100 ఏళ్లుగా తమ పూర్వీకులు సర్వే నంబరు 172–6, 172–7, 172–8, 172–9లలో 4 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నామాల గ్రామానికి చెందిన కప్పల పెద్దక్క పేరున అక్రమంగా పట్టా పొంది, బ్యాంకు లోనూ రుణం పొందారన్నారు. తాము ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తే తామే సాగులో ఉన్నామని దర్యాప్తులో తేలిందన్నారు. భూమి దక్కదని అక్కసుతో వైఎస్సార్‌సీపీ నాయకులు దౌర్జన్యంగా భూమి లాక్కున్నారని పత్రికల్లో అసత్య కథనాలు రాయించడం సరికాదన్నారు. అధికారులు పరిశీలించి, తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఎస్‌ఆర్‌ఐటీకి నేషనల్ ఎంప్లాయిబిలిటీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్‌ఆర్‌ఐటీ యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు ఎస్‌హెచ్‌ఎల్ ద్వారా నేషనల్ ఎంప్లాయిబిలిటీ అవార్డు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌ఎల్ ట్యాలెంట్ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్, సైకోమెట్రికల్ టెస్ట్‌లలో ప్రముఖ బ్రాండ్ అన్నారు. కమ్యూనికేషన్, టెక్నికల్, స్కిల్స్, లాజికల్, రీజనింగ్ క్వాంటిటేటివ్ స్కిల్స్, జాబ్ స్పెసిఫిక్ డోమైన్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్‌ఆఫీసర్ డాక్టర్ రంజిత్ రెడ్డి, అధ్యాపకులుతదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం.. లక్ష పుష్పార్చనం



పుష్పాలంకార సేవలో అయ్యప్ప స్వామి

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. సోమవారం అయ్యప్ప స్వామికి లక్ష పుష్పార్చన కనులపండువగా జరిగింది. గురుస్వాములు లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు నేతృత్వంలో రాత్రి అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో జరిగింది. కార్యక్రమంలో ఈవో రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు సురేష్, చంద్ర, తిమ్మారెడ్డి, వెంకటస్వామి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు న్యాయం చేయండి

అనంతపురం అర్బన్: ఎస్సీలకు ఇచ్చిన పట్టాలను రెవెన్యూ అధికారులు రద్దు చేసి, అన్యాయం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ అన్నారు. ఎస్సీలకు న్యాయం చేయాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ కురుగుంట గ్రామం సర్వే నంబరు 41–1, 3, 3బీలో 6.30 ఎకరాల భూమిని ఎస్సీలకు ఇచ్చారన్నారు. అయితే ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఈ భూమి రద్దు చేశారన్నారు. దీంతో తాము హైకోర్టుకు వెళ్తే తమకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు హైకోర్టు తీర్పును ధిక్కరించి ఎస్సీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సామ్రాట్ మధు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే 'తోపుదుర్తి' ధ్యేయం



సనప వద్ద తారు రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: ప్రజాసంక్షేమమే తోపుదుర్తి కుటుంబ ధ్యేయమని, ఎన్ని అడ్డంకులు వచ్చినా, ప్రజలకు ఇచ్చిన మాట నెరవేరుస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తండ్రి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి తెలిపారు. సోమవారం అనంతపురం నుంచి శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం తగరకుంటకు వెళ్లే రహదారికి సంబంధించి తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆత్మారామిరెడ్డి సనప గ్రామం వద్ద తారు రోడ్డు పనులను పరిశీలించారు. తారు రోడ్డు నిర్మాణ పనులను పూజ చేసి, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పరిటాల కుటుంబం అధికారంలో ఉన్నా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తోపుదుర్తి కుటుంబం కష్టపడుతోందన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రజా సేవే ధ్యేయమని, రైతులకు నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా ఉచిత బోర్లు వేయించారన్నారు. అమ్మ డెయిరీని ఏర్పాటు చేసి, ప్రజల గుండెల్లో నిలిచాడన్నారు. కార్యక్రమంలో మండల ఎలక్షన్ ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, రమేష్, కక్కలపల్లి జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు

అనంతపురం టవర్‌క్లాక్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు అన్నారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుంటిమద్ది ఓబులేసు మాట్లాడుతూ జనవరి 31న చలో విజయవాడ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోవడంతో మాదిగలు అత్యధికంగా నష్టపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టబద్ధత కల్పించి, మాదిగలకు న్యాయం చేయాలన్నారు. పేద కుటుంబాలకు మూడెకరాల భూమి పంపిణీ చేయాలని, మాదిగల సమస్యల పరిష్కారంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయప్ప, నాగరాజు, పెద్దన్న, శ్రీనివాసులు, నరసింహులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలని దీక్ష



కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న వాల్మీకి సేవా సమితి నాయకులు

అనంతపురం అర్బన్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆలిండియా వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేశారు. స్థానిక టవర్‌క్లాక్ నుంచి కలెక్టరేట్ వరకు సమితి నాయకులు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ దీక్ష చేశారు. సంఘం నాయకులు వెంకటేశ్, బ్రహ్మయ్య మాట్లాడారు. గతంలో వాల్మీకి బోయలు ఎస్టీ జాబితాలో ఉండేవారన్నారు. ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ఎస్టీలు గానూ, మరికొన్ని రాష్ట్రాల్లో ఎస్సీలుగా ఉన్నారన్నారు. రాష్ట్రంలోనూ ఎస్టీలుగా ఉన్న వాల్మీకులను ఆ జాబితా నుంచి కొనేళ్ల క్రితం తొలగించారన్నారు. వాల్మీకులు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా చాలా వెనుకబాటును అనుభవిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎస్టీ పునరుద్ధరణ జరిగితేనే వాల్మీకులకు న్యాయం జరుగుతుందన్నారు.

యోగా పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ఎస్ఓ, పాఠశాల సిబ్బంది

కనగానపల్లి: రాష్ట్ర స్థాయిలో గుంటూరులో జరిగిన యోగా పోటీల్లో కనగానపల్లి కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ఎస్ఓ నరసమ్మ తెలిపారు. సోమవారం ఎస్ఓ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా తరపున రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు హరిత, వంశిక, శ్రావ్య, హరిప్రియ, పూర్ణిమ బాగా రాణించి పతకాలు సాధించారన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

రామగిరి: పేరూరులో బెస్తసేవా సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేక రంగుల పూలతో అలంకరించారు. అమ్మవారికి బోనాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. బెస్తలు మాట్లాడుతూ పేరూరులో పెన్నానది తూర్పు నుంచి పడమరకు పారుతోందని, ఇలాంటి గంగమ్మ అరుదుగా ఉందన్నారు. ప్రతి సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏటా అమ్మవారికి పూజలు చేయనున్నట్లు తెలిపారు.

నేడు వేమన పద్య పోటీలు

అనంతపురం కల్చరల్: ఈనెల 19న వచ్చే ప్రజాకవి వేమన జయంతి సందర్భంగా తెలుగు భాషా వికాసానికి జీవం పోసిన వేమన పద్యాల పోటీలు నిర్వహిస్తున్నట్లు వేమన ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సెల్: 9963917187లో సంప్రదించాలన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు చేస్తున్న అర్చకుడు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న తోపుదుర్తి నయనతారెడ్డి,మనోరమ



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మాల ధారులతో పాలకావడి ఉత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న తోపుదుర్తి కుటుంబ సభ్యులు.. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాలకావడి ఉత్సవం, కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకురాలు తోపుదుర్తి నయనతారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సతీమణి మనోరమ, ఎమ్మెల్యే తల్లి ప్రియదర్శిని పూజల్లో పాల్గొన్నారు. స్వామికి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. మంగళహారతి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.